# ఎంగిలి మెతుకులు

సత్రవంతా బిక్కుబిక్కుమంటోంది. మసిబారిన మొండిగోడలు అర్ధరాత్రి శ్మశానంలో గోరీల్లా నిలుచున్నాయి. మధ్యమధ్య మసిబొగ్గుతో గీసిన అడ్డమైన నానారాతలూ చిందరవందరగా కనిపిస్తున్నాయి. ఏళ్ళ తరబడి ఆలనాపాలనాలేని ఆ సత్రం దూలాలనుండి సాలీడులు వేలాడుతూ గాలికి ఉయ్యాలలూగుతున్నాయి. కుండపెంకులు, కాగితం ముక్కలు ఆ సత్రం నలుమూలలా అగుపిస్తున్నాయి.

అంతవరకు కథచెప్తున్న గడ్డం సాధువు, కునికిపాట్లతో ఆవలిస్తున్న చుట్టూవుండే జనాన్ని చూసి కథని మరుచటిదినానికి వాయిదావేసి అక్కడే నడుం చేరేశాడు. సత్రం పెద్ద చావడిలో అప్పుడే నిద్రాదేవి ఒడిలో గట్టిగా గుర్రుపెడుతోన్న వెంకాలు కాల్చిపారేసిన చుట్టపీకనుండి యింకా పొగవస్తూనే వుంది. నిద్రలో కాస్సేపు కలవరించిన నాగులు తిరిగి చప్పబడిపోయాడు.

చిమ్నీలేని కిరసనాయిలు దీపం గాలికి అటూయిటూ ఊగి ఆరిపోయింది. నలువైపులా దట్టంగా ఆవరించిన అంధకారం మధ్య నిశ్శబ్దంగా వున్న సత్రవలో కొద్దిగా సంచలనం కలిగింది.

అందంగా ముస్తాబైన 'రామి' నలిగిపోయి వాడిపోతున్న కనకాంబరం దండ జెడలోంచి జారుతుంటే సత్రం చేరుకుని ఓమూల చతికిలబడింది.

అలికిడి విని లేచిన మంగి ఓ పక్కకు వత్తిగిల్లి "ఏందే, ఓరూ దొరకనేదా?" అంది నిద్రకళ్ళతోనే.

"ఊర్కోవే పోలీసొత్తుండాడు. ఏదీ, కాత్త అలా జరుగు, నీ పక్క నిద్దరోతాను" అంటూ మంగి పక్కకు చేరి ముసుగు కప్పింది రామి.

"ఓ యబ్బో! భయంగల పిల్లే. ఇట్టా అయితే యేపారం ఏం సాగుద్దంటే." మంగి ముసుగులోంచి గుసగుసమన్నట్టుగా అంది.

"నీ క్కాదటే సెప్పేది. పోలీసొత్తుండాడు. కాస్సేపు మాటాడక తొంగో."

మంగి మరింకేమీ మాట్లాడలేదు. పక్కనుండి భారంగా వినిపిస్తోన్న ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని వింటూ వుండిపోయింది.

సత్రం బయట బూట్ల శబ్దం గుమ్మంవరకూ వచ్చి ఆగిపోయింది. ముసుగులోని రామి గజగజా వణికిపోయింది. కన్నంలోంచి చూస్తే బయట ఒక తెల్లటి ఆకారం పక్కనున్న పోలీసుతో ఏదో చెప్పి సత్రంలోకి చూపించి వెళ్ళిపోవడం కనిపించింది.

రామి ఊపిరిబిగపట్టి అలికిడి వినడానికి ప్రయత్నించింది. కాస్సేపటివరకూ ఎలాటి శబ్దమూ వినిపించలేదు. ఆ తర్వాత బూట్లశబ్దం క్రమంగా తగ్గిపోయి అంతరించిపోయింది.

రామి గట్టిగా ఊపిరి విడిచి ముసుగునెట్టి లేచి కూర్చుంది. "ఈయాల ఆడి సేతుల్లో పడేదాన్నే. నాయాల సూసినట్టుండాడు" అంటూ, సత్రం గుమ్మం వరకూ వచ్చి అటూయిటూ తొంగిచూసి మళ్ళీ మంగి పక్కగా వచ్చి పడుకుంది.

"అసలేం జరిగిందేంటే?" అంది విసుగ్గా మంగి, రామి భయానికి కారణం ఏమిటో అర్థంకాక.

"నానోట్లో దుమ్ముపోత్తే ఆడుమాత్రం బాగుపడతాడంటే. ఈయాల రూపాయి డబ్బులు సేతులో కొత్తదనుకున్నాను. ఆ బాబుగారు రూపాయి యిత్తానన్నారు. ఆఖరిని ఎల్లిపోయేప్పుడు అడిగితే యింకో రూపాయి యిచ్చేవోరు. అలా గోదారొడ్డు ఇస్కూల్లోకి తీసుకెళ్ళాను. అయిదు నిమిషాలయినా కాలేదు ఆ ముసలిముండాకొడుకు- ఇస్కూలు సూత్తుంటాడు ఆడు- 'ఓరక్కడ' అని గట్టిగా అరుత్తుండాడు. ఆడి కళ్ళల్లో కారం జల్లా. ఆడికి అప్పుడప్పుడు కాపీకి డబ్బులు యిచ్చినా ఎదవఅల్లరి సేసిపారేసాడు. ఆడిగోలయిని రేత్రి గస్తీ తిరుగుతుండే పోలీసోడు ఇస్కూలులోకి వత్తుండాడు. ఇంకప్పుడు నా పాణం పైకెగిరిపోయిందంటేనమ్ము. ఆ బాబుగారు చేతిలో డబ్బులు పెట్టకుండా

గోడదూకిపోయాడు. ఆడముండని నేనొక్కర్తినీ ఏంసేసేది? రేత్రి గెంజికాసినాక మిగిలిన బేడ మొల్లో దాసింది తీసి ముసలోడి సేతుల్లో పెడ్తే "ఓసి నువ్వటే! ఓరో అనుకున్నాను" అన్నాడు. ఆడిదంతా ఎదవనాటకం. డబ్బులు గుంజుదామని ఆ ఎత్తేసాడు. 'మరిప్పుడు నేనెలా బయటికి పోయేది ముసిలోడా' అని అడిగితే 'గోడదూకలేవటే. ఆ మాత్రందానికి యీపనెందుకు సేత్తుండావే? ఊ పరుగెత్తుకుపోవే. పోలీసోడు సూత్తే నా పీకట్టుకుంటాది' అన్నాడు. అప్పుడిక నేనింకేంసేసేదిఆడనించి యెనకాల గోడదూకి లగెత్తుకొచ్చాను. ఆడు సూసే వుంటాడు. ఎదవ ఆ ముసలోడు యీసారి కనబడనీ, చడమడా నాలుగు తిట్టేత్తాను. ఏదైనా అంటే ఆడి సంగతి నాకు తెలీదేంటి. ఆడి కూతురు ఆ సాయిబాబుగాడితో తిరగండంనేదూ"

"ఓలె! ఇంతసేసినా ఓ కానీకూడా దొరకనేదంటే" అంది మంగి సానుభూతిగా.

"ఏందే. ఇంకా నా దగ్గరవి బేడ్డబ్బులు వొదిలేయి. ఈయాల ఏపనిసేసినా యిలా తగలడతున్నాది. పొద్దున్న బజార్లోంచి గంపెత్తుకొత్తుంటే ఓ బాబుగారు అలాటోళ్ళేమోనని ఉండలేక ఏదో అన్నాను. ఆరు బజార్లో జోడెత్తి కొట్టడానికికూడా వచ్చారు. మొన్న రేత్రి సిన్నసెట్టి యీడకి వొచ్చాడని ఆరిబాబుకి ఎలా తెలిసిందో మద్దేనం కూలెత్తుకొత్తుంటే చెళ్ళున లెంపకాయ కొట్టి "ఈయాల గనక ఊరుకున్నాను. ఇంకెప్పుడన్నా యిలా సేసేవంటే కొట్లో పెట్టిత్తా' నన్నారు. అసలు, ఆరిని యిక్కడకు రమ్మన్నానా? ఆరే వొచ్చారు. దానికి నేనేం తప్పు సేసేను? ఓరూ బుద్దిసెప్పేవోళ్ళు లేకపోతే సరి"

సత్రవ మూల ఏదోఅలికిడి అయ్యింది.ముసుగులోంచి ఓతల బైటకు వచ్చి "ఆడముండలు యింకా నిద్దరోలేదంటే" అంది.

"నువ్వు నిద్దరోయే మంగి, నే వత్తాను " అంటూ ఆ ముసుగు మనిషి దగ్గరకు వెళ్ళింది రామి. ముసుగు తొలగిస్తూ "ఏం బావా! పక్కన సేరబడమంటావా?" అంది.

"నీకు ఎప్పుడూ యిదేనేంటే, నిద్దరపోనియ్యవేందే?" అని ఓ పక్కకు జరిగాడు.

రామి ఓమారు ఒళ్ళు విరుచుకుని ముసుగులోకి దూరి మంచుగడ్డలాంటి చలికాలపు నాపరాతిమీద వెచ్చగా వుండేలా ఆపాదమస్తకం ముసుగు కప్పుకుని 'ఇంకొంచెం యిటు జరుగుబావా" అంది.

అంతటా నిశ్శబ్దం.

మళ్ళీ ఉక్కుబూట్లు శబ్దం చేసుకుంటూ వచ్చి సత్రవముందు ఆగాయి.

ముసుగులోని మనిషిని యింకా గట్టిగా అంటిపెట్టుకుంది రామి. శీతాకాలపు చలి కొరుకుతూ వుంటే, మనసుచుట్టూ ఆవరించిన భయానికి మరింతగా వణికిపోతూవుంది.

పోలీసు గుమ్మందాటుకుంటూ వచ్చి "ఎవరక్కడ?" అన్నాడు. కంచుగంటలా ఆ శబ్దం శిథిలమైన ఆ సత్రవ గోడలమధ్య భయంకరంగా ప్రతిధ్వనించింది.

రామి లేచి కూర్చుంది.

పోలీసు అగ్గిపుల్ల గీసి చూశాడు. గడ్డిపోచలాగ గజగజలాడుతోంది రామి.

"ఓసీ నువ్వటే! ఏవిటి రావీ; యిందాక నువ్వేనా యిటు పరుగెత్తుకొచ్చావు?" అన్నాడు పోలీసు వెంకటస్వామి.

రామి ఆశ్చర్యపోతూ "నువ్వా మావా! ఓరో అనుకున్నాను" అంది.

"నీకు ఎన్నిసార్లు చెప్పానే, యిలా బైట తిరగొద్దని. ఇంకో పోలీసోడెవడైనా చూస్తే బొక్కలో యెట్టి మక్కలిరగదంతాడు తెలుసా. నేం గనక ఊరుకుంటున్నాను". వెంకటస్వామి మీసాల్ని మెలిపెడుతూ ఆ మెలిపెడుతున్న మీసం కిందుగా చిరునవ్వును చూపిస్తూ అన్నాడు.

రామి మాటాడక ఊరుకుంది - 'ఇటువంటివి చాలా చూశాంలే' అన్నట్టుగా. ఆ తర్వాత ఏదో జ్ఞాపకంవచ్చి "ఇందాకోసారి యిట్టావచ్చావు కదుమావా?" అంది.

"అదేనే, ఓమారు నాలుగు వీధులూ తిరిగి డ్యూటీ కాగానే వెళ్ళిపోయేప్పుడు యిలా వద్దామని వచ్చాను" అన్నాడు.

"అయితే నీకూడా ఆరెవరినో చూసాను. ఎవరేంటి?" వయ్యారంగా చేతుల్ని వెంకటస్వామి భుజంమీద వేసి అడిగింది.

"ఎవరయితే నీకెందుకులే. ఇందాక గోడదూకి పోయాడుకదా, ఆయన" చెప్పకూడదనుకునే చెప్పేశాడు.

"ఆరి దగ్గర ఎంత డబ్బు నాగావేంటి?" ఆతృతగా అడిగింది.

"ఏదోలేవే, ఓ పదిరూపాయలు, పర్సులో వున్నవే అంత. రేపు డాక్టరుకి ఫీజు కట్టడానికి సరిపోతుంది." రామి వాటాకూడుతుందేమోనని ముందే సరిపెట్టి చెప్పాడు.

రామి ఆశగా కళ్ళను యింతింత చేసుకుని చూసింది. ఆ కళ్ళల్లో తొణికిసలాడిన ఆవేదన బైటికి కనిపించకుండా చీకట్లోనే కరిగిపోయింది. "నువ్వే నయం మావా, ఏం కష్టపడకుండా పదిరూపాయలు సంపాదించావు. నేనింత సేసినా సిల్లుకానీకూడా

సేతిలోకి రాలలేదు కదా?"

"పోనీలేవే, ఒకో రోజే అంత. అయినా యీ ఎదవపని నువ్వు మానేరాదుటే"

"మానేసి ఏం సెయ్యమంటావు? ఇప్పుడు కూలిసెయ్యడంనేదా. కూడుకే గతిలేనప్పుడు ఏంసేత్తే ఏం వొచ్చిందేం?" ఆవేశంతో అంది రామి. ఆ మాటలు అగ్నిపర్వతం పేలినప్పుడు ఎగిరిపడే లావాల్లాంటివి. ఆమె గుండెల్లో ఎప్పటినుంచో గూడుకట్టుకొన్న ఆవేదన హృదయాన్ని చీల్చుకుని మాటలుగా బైటపడ్డాయి.

వెంకటస్వామి ఓ నిమిషం ఏమీ మాట్లాడలేదు. జేబులోంచి చుట్టతీసి వెలిగించుకుని గట్టిగా దమ్ములాగి పొగని వదుల్తూ "పోనీలేవే. నేను చెప్తే మాత్రం వింటావా. ఆ మూల కెళ్దాం పద" అన్నాడు హుషారుగా ఆమె భుజంమీద చెయ్యివేస్తూ.

"ఇప్పుడొద్దు మావా. రేపు రా సూద్దాం" అంది రామి, అలసిపోయిన శరీరానికి కాస్తంత విశ్రాంతినిచ్చే ఉద్దేశంతో.

వెంకటస్వామి గంభీరంగా ఆమెవైపు చూశాడు. నోట్లో చుట్టను బైటకి తీసి పొగను ఆమె కళ్ళల్లోకి వదుల్తూ "ఏవిటే, నేనడిగితేనే అలా అంటావు., ఇంకోరెవరైనా అయితే ఎగిరిపోతుంటావ్? ఫరవాలేదులే యిటురా" అంటూ ఆమె చెయ్యిపట్టుకుని చీకటి మూలవైపుగా లాగాడు.

నిర్జీవంగా ఆమె అతనివెంట వెళ్ళింది.

అర్ధగంట తర్వాత వెంకటస్వామి బూట్లు టకటక లాడించుకుంటూ సత్రవ మెట్లు దిగాడు.

'రేపు కూడొండుకోడానికి గింజలులేవు మావా" అని గొణుక్కున్నట్టుగా అంటున్న రామి మాటలు వినిపించుకోకుండా పెద్దపెద్ద అంగలేసుకుంటూ వెళ్ళిపోయాడు వెంకటస్వామి.

రిక్తహస్తాలతో కొయ్యబొమ్మలా నిలబడిపోయింది రామి. నీరసం, నిస్సత్తువ, ఆకలి ఆమెను ఆవరించాయి.

తన చుట్టూ ఏముందో ఆమెకు కనిపించలేదు, ఒక్క ముదనష్టపు బతుకులోని ఎంగిలిమెతుకుల ఆంతర్యంమాత్రం శూన్యంగా గోచరించింది.